నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రాయలసీమ ద్రోహి జగన్

- శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

రోడ్ షోలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్/పగిడ్యాల/పాములపాడు

రాయలసీమ ద్రోహి జగన్ అని, సీమ ప్రాజెక్టుల పనులు చేయకుండా అన్యాయం చేశారని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధం కార్యక్రమాన్ని మంగళవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నుండి ఆయన ప్రారంభించారు. ముందుగా ఆయన కర్నూలు విమానాశ్రయం నుండి నందికొట్కూరుకు రోడ్డు మార్గంలో వచ్చారు. అక్కడ రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. అనంతరం పాములపాడు మండలం బానకచర్ల హెడ్ రెగ్యులేటర్‌ను చంద్రబాబు సందర్శించారు. అంతకుముందు నందికొట్కూరు రోడ్ షోలో చంద్రబాబు మాట్లాడుతూ గోదావరిలో 3 వేల టిఎంసిల నీళ్ళు సముద్రంలో కలుస్తున్నాయన్నారు. శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపిని రాబోయే ఎన్నికల్లో భూస్థాపితం చేసి ఇంటికి పంపితే తప్ప రాయలసీమకు న్యాయం జరదగని తెలిపారు. ప్రాజెక్టుల్లో నీళ్ళు లేకుండా చేసిన ఘనత జగన్‌దేనన్నారు. కర్నూలు జిల్లాకు తాము విమానాశ్రయం, ఇండస్ట్రియల్ హబ్ తెచ్చామని చెప్పారు. జగన్ కర్నూలుకు న్యాయ రాజధాని తెచ్చారా అని ప్రశ్నించారు. నందికొట్కూరు నియోజకవర్గాన్ని రూ.1200 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. అలగనూరు నుంచి ఇస్తామన్న నీళ్ళు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇసుక దందా, మద్యం దందా సాగుతోందన్నారు. ప్రపంచానికే ఆదర్శం కావాలంటే వినూత్న పద్ధతులు పాటించాలన్నారు. మిడుతూరు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తామని, నందికొట్కూరు రోడ్డు వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారు. కరెంట్ ఛార్జీలు పెరగకుండా బాధ్యత తీసుకుంటామన్నారు. మద్యం ధరలు తగ్గిస్తామని, నాణ్యమైన మద్యం వస్తుందని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్క ఏకరాకూ నీళ్ళిస్తామని, అందరికీ ఉద్యోగాలు వచ్చే వరకూ తానుంటా నని తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తా మన్నారు. అలాగే బానకచర్ల వద్ద మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేదని, ప్రాధాన్యత లేకుండా ఇష్టాను సారంగా చేయడం వల్ల అన్యాయం జరిగే పరిస్థితి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాకా వైసిపి ప్రభుత్వం రివర్స్ నిర్ణయాలు చేసిందని, 198 ప్రాజెక్టులు రద్దు చేశారని తెలిపారు. కర్నూలు జిల్లాలోని గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ కోసం ఒక్క పైసా ఖర్చు పెట్టలేదన్నారు. 2014 నుండి 2019 వరకు రాయలసీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చు పెడితే, వైసిపి ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు దేవినేని ఉమా, భూమా అఖిల ప్రియ, ఫరూక్, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, కర్నూలు జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు నాయుడు

పేద విద్యార్థులకు

వైద్య విద్య దూరం చేయొద్దు

- మెడికల్ సీట్లను అమ్మడం దుర్మార్గం : ఎస్‌ఎఫ్‌ఐ
- 107, 108 ఉత్తర్వులను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విద్య సీట్ల భర్తీలో విద్యా వ్యాపారానికి ఎర్రతివాచి పరిచి బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యకు దూరం చేయవద్దని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, జిల్లా సహాయ కార్యదర్శులు కిరణ్, ప్రతాప్‌లు పేర్కొన్నారు. వైద్య విద్య సీట్ల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 107, 10 ఉత్తర్వులను నిరసిస్తూ అధ్వర్యంలో మంగళవారం స్థానిక పద్మావతి నగర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్నామని పెద్ద ఎత్తున రాజకీయ ప్రచారం చేసు కుంటుందని, నేడు ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలల్లో సీట్లు అమ్ముకునేందుకు 107, 108 ఉత్తర్వులు తీసుకొచ్చారని విమర్శించారు. ఈ సీట్ల అమ్మకం ఐదు కళాశాలలతో ప్రారంభమై భవిష్యత్తులో అన్ని కళాశాలల్లో దీనిని అమలు చేస్తారని, ఇది వైద్య విద్య పేదలకు దూరం చేయడమేనని అన్నారు. మూడు కేటగిరిలుగా సీట్లను భర్తీ చేసి వాటిలో 50 శాతం సీట్లను సెల్ఫ్‌ఫైనాన్స్, ఎన్‌ఆర్‌ఐ భర్తీ ద్వారా కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా తయారు చేస్తున్నారని విమర్శించారు. 25 శాతం సీట్లను మాత్రమే రిజర్వ్‌గా కేటాయించడం అంటే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టి విద్యార్థులకు ద్రోహం చేసినట్లే అన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణలో నూతన కళాశాలలు ప్రారంభిస్తున్నా కన్వీనర్ కోటాలోనే సీట్ల భర్తీ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి విద్యలో చేపడుతున్నట్లు విప్లవాత్మమైన మార్పులు అంటే బలహీన వర్గాల ప్రజలకు విద్యను దూరం చేయడమేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో డబ్బు ఉన్నవాడికి, పేద వాడికి వార్ జరుగుతుందని, అదే క్లాస్ వార్ అని నిరంతరం ఉదరగొడుతున్న సిఎం సీట్ల కేటాయింపుతో ఎవరి పక్షమో ప్రజలకు అర్థమైందని అన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి వెంటనే ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుని పేద విద్యార్థులకు వైద్య విద్యకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద యెత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ సురేంద్ర వీరమరణం

- జమ్మూకాశ్మీర్ ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి
- శోకసంద్రంలో కృష్ణానగర్ గ్రామస్తులు - నేడు అంత్యక్రియలకు ఏర్పాట్లు

ఆర్మీ జవాన్ సురేంద్ర (ఫైల్)

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం మద్దూరు మజరా గ్రామం కృష్ణానగర్ గ్రామానికి చెందిన భారతజవాన్ సిరిగిరి సురేంద్ర(24) జమ్మూకాశ్మీర్ బారాముల్లా జిల్లాలో ఉగ్ర వాదుల ఎదురుకాల్పుల్లో సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వీరమరణం పొందారు. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. కృష్ణానగర్ గ్రామానికి చెందిన సిరిగిరి సుబ్బయ్య, సిరిగిరి సుబ్బమ్మల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు సురేంద్ర 2019 మార్చి 31న భారత జవానుగా ఆర్మీలో చేరారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఉగ్రవాదుల ఎదురుకాల్పుల్లో మరణించారు. ఈ వార్త తెలిసిన కృష్ణానగర్‌లో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగారు. పేద రైతు అయిన సుబ్బయ్య తన ఇద్దరు కుమారులలో దేశ రక్షణ కోసం చిన్న కుమారుడిని పంపారు. నాగపూర్‌లో ట్రైనింగ్ చేసి ఉత్తర ప్రదేశ్‌లో బాబినలో పోస్టింగ్ జాయిన్ అయ్యాడు. అక్కడి నుండి (6 గాడ్ రెజిమెంట్) 46 రాష్ట్రీయ రైఫిల్ (బారాముల్ల సెక్టార్)లో విధులు నిర్వహిస్తునారు. రెండు నెల క్రితం సెలవులపై ఇంటికి వచ్చారు. మళ్లీ సెప్టెంబర్‌లో సెలవులకు ఇంటికి వస్తానని చెప్పాడనని, మూడు రోజుల క్రితం కూడా తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగారు. ఆయన భౌతిక కాయాన్ని బుధవారం కృష్ణానగర్‌కు తీసుకు రానున్నారు. అధికార లాంచనాలతో అంత్య క్రియలకు తహశీల్దార్ రత్నరాధిక, ఎంపిడిఒ గోపికృష్ణ, ఇఒఆర్‌డి శ్రీనివాసులు నాయుడు ఏర్పాట్లు చేపట్టారు. అంత్యక్రియలకు పలువురు జిల్లా స్థాయి అధికారులు హాజరు కానున్నారు.

మున్సిపల్ కార్మికులకు

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

- సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- సిఐటియు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ కార్యదర్శి భాస్కరాచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు మాట్లాడారు. నంద్యాల మునిసిపాలిటీలోని పర్మినెంట్, ఇంజనీరింగ్, పారిశుధ్య, క్లాప్ డ్రైవర్స్ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ ఎపిసిఒఎస్ నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. జీవో 151 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని అర్హత కలిగిన కాంట్రాక్టు కార్మికుకు, జిఒ 7 ప్రకారం కనీస విద్యా అర్హత, సీనియారిటీ ప్రాతిపదికన అర్హత కలిగిన ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.6 వేల హెల్త్ అలవెన్సులు, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని, పనిముట్లు, రక్షణ పరికరాలు ఇప్పించాలని, ఇళ్ల స్థలాలు, ఇళ్ళు కట్టించి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. 60 సంవత్సరాలు పూర్తి అయ్యి రిటైర్డు అయిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి మహమ్మద్ గౌస్, అధ్యక్షుడు డి.లక్ష్మణ్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు భాస్కరాచారి, కృష్ణయ్య, రామకృష్ణ, ఆదాము, **(మిగతా 6వ పేజీలో..)**

చైర్మన్, కమిషనర్‌లకు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

తల్లిదండ్రుల చేతుల మీదుగా ఆఫర్ లెటర్‌ను అందజేస్తున్న దృశ్యం

కెవి సుబ్బారెడ్డి కళాశాల విద్యార్థిని సాఫ్ట్‌వేర్ జాబ్‌కు ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం బిబిఏ చదువుతున్న విద్యార్థిని తనూజ అసెంచర్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగానికి ఎంపికైంది. సంవత్సరానికి రూ. 3.5 లక్షల ప్యాకేజీని విద్యార్థినికి వేతనంగా సాఫ్ట్వేర్ కంపెనీ ప్రకటించింది. ఈ సందర్భంగా విద్యార్థిని తనూజకు తల్లిదండ్రుల సమక్షంలో ఆఫర్ లెటర్‌ను కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, డైరెక్టర్ భూమా శ్రీనివాస్ రెడ్డిలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి కష్టపడి బాగా చదువుకొని తనూజ లాగానే అందరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తద్వారా తల్లిదండ్రుల ఆశలు సఫలీకృతం అవుతాయన్నారు. అనంతరం సాఫ్ట్వేర్ ఉద్యోగానికి ఎంపికైన తనుజను కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఓబన్న పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

రూ. 5 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన మోత్కుపాటి సుబ్బారెడ్డికి చెందిన మట్టి మిద్దె మంగళవారం కుప్పకూలింది. వివరాలు.. ఇటవీల కురిసిన వర్షాలకు మట్టి మిద్దె పూర్తిగా తడిసింది. మట్టిమిద్దె కూలిపోవడంతో పిండి మిషన్, వడ్ల మిషన్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. దాదాపు 5 లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

మిద్దె కూలడంతో ధ్వంసమైన మిషన్లను చూపుతున్న బాధితుడు

ఆశా వర్కర్లపై పని భారం తగ్గించాలి

- వ్యాక్సిన్ క్యారియర్ మోయించరాదు
- ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆశా వర్కర్లపై పని భారాన్ని తగ్గించాలని, వారితో వ్యాక్సిన్ కారియర్లు మోయించరాదని, ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని, ఆశావర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం తగ్గించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి.బాల వెంకట్, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా డే కార్యక్రమంను పురస్కరించుకొని ఆశాలపై పనిభారం తగ్గించాలని తదితర డిమాండ్లతో జిల్లాలోని వివిధ పిహెచ్‌సిలలో ఆశాలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వమే ఆశా నియామకాలు జరపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాలకు సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు ఆశావర్కర్స్ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, వేతనంతో కూడిన వెటర్నరీలు ఇవ్వాలన్నారు. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. 104 ఉద్యోగుల కోసం ఆశా వర్కర్లతో ఎటువంటి అదనపు ఖర్చులు చేయించరాదని డిమాండ్ చేశారు. నాణ్యమైన సెల్ ఫోన్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని తదితర డిమాండ్ల వెంటనే పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశాల్లో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చెన్నమ్మ, సువర్ణ, రాజేశ్వరి, నాగలక్ష్మి, సుభద్ర, ఆశాబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

ఎల్ఐసి సిబ్బంది పట్ల కేంద్రం వివక్ష

- ఎల్ఐసి ఉద్యోగుల సంఘం
- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎల్ఐసి సిబ్బంది పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎ.రమేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం ఎల్ఐసి సంఘాల దేశవ్యాప్త సంయుక్త కార్యాచరణ పిలుపు మేరకు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో లాగా, ఇతర సంస్థల్లో లాగా 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ చెల్లించాలని, కొత్త పెన్షన్ స్కీం లో 14% యాజమాన్యం వాటా చెల్లించాలని, వేతన సవరణ చర్చలు తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఫ్యామిలీ పెన్షన్ 30 శాతానికి పెంచాలని ఎల్ఐసి 2019 లోనే కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినా ఇంతవరకు ఆమోదం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 2010 తర్వాత చేరిన వారందరికీ నూతన పెన్షన్ స్కీంలో 14 శాతం 'యాజమాన్య పీఎఫ్ వాటా' చెల్లిస్తున్నారని, ఎల్ఐసిలో ఇప్పటికీ అది 10 శాతమే అన్నారు. 2022 నవంబర్ నుండి బ్యాంకుల్లో వేతన సవరణ బకాయి పడితే, ఇప్పటికే చర్చలు మొదలయ్యాయని, ఎల్ఐసిలో ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. ఇలా ప్రతి చిన్న, పెద్ద సమస్య పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ బీమా ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతోందన్నారు. ఇదే ధోరణి కొనసాగితే, రాబోయే రోజుల్లో ఐక్య ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ల నేతలు అధ్యక్షురాలు హరిప్రియ. జాయింట్ సెక్రెటరీ ఎ.వెంకట రాముడు, ఆఫీసర్ అసోసియేషన్ నాయకులు బి.గురవయ్య నాగార్జున, ఏజెంట్ అసోసియేషన్ నాయకులు ఎం.శ్రీనివాస రెడ్డి, భాస్కర్ రెడ్డి, తిరుపాలు, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న నాయకులు, సిబ్బంది

ప్రథమ స్థానంలో నిలిచి విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థినికి జిల్లా ప్రథమ స్థానం

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని భారతీ విద్యామందిరం పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సబియా సైన్స్‌ఫెయిర్‌లో జిల్లా ప్రథమ స్థానం సాధించిందని ప్రధానోపాధ్యాయులు ప్రసాదు మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేతంచెర్లలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో 17 పాఠశాలలు పాల్గొనగా ఫస్ట్ ఎయిడ్ బాక్సు విభాగంలో తమ పాఠశాల విద్యార్థిని అద్భుత ప్రతిభ కనబరచి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు చెంచుసుబ్బారావు, సుంకురాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డలోని 4వ సచివాలయం పరిధిలోని గాయత్రి వీధి, రామకృష్ణ రెడ్డి నగర్, మైకేల్ వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసన సభ్యులు గంగుల బ్రిజేంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించవలసిందిగా సంబంధింత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళలాంటివన్నారు. అనంతరం గాయత్రి మాత ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్.వి జగన్ మోహన్ రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వైసిపి పట్టణ ఇన్చార్జి గొట్లురు సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, నాయకులు షేక్ ఆజాద్, అల్లా బకష్, సచివాలయం అడ్మిన్ మాసుం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని సంత జుటూరు గ్రామంలోని ఇందిరానగర్ బిసి కాలనీలో వైసిపి నాయకులు కొంగీస శివశంకర్, భూమా రఘునాథరెడ్డి, దూదేకుల మౌలాలి ఆధ్వర్యంలో మంగళవారం రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను డోజర్ ద్వారా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ సంత జుటూరు గ్రామంలో బుధ, గురువారం జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డోజర్‌తో రోడ్డు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

చెంచు గిరిజన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రాష్ట్రంలో సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జిసి పాలెం మజరా గ్రామం నెమళ్లకుంట చెంచుగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిసి పాలెంలో ఎమ్మెల్యేకు నాయకులు ఆర్ శ్రీనివాసరెడ్డి, బలరాం రెడ్డి, జయరాం, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వైఎస్ విగ్రహానికి పూలమాల లేసి అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి వారు పొందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం నెమళ్లకుంట చెంచు గిరిజన గూడెంలోకి వెళ్లగా చెంచులు తమకు పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. వెంటనే ఆర్డిటి అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌ఛార్జి శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున రెడ్డి, ఎంపీటీసీ కొర్రపోలు అర్జున్, సన్నాల శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో వాసుదేవ గుప్తా, తాసిల్దార్ రవికుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఇ లక్ష్మీ నరసింహ, వీఆర్‌ఏ వెంకటయ్య, వెలుగు ఏపిఎం రాజశేఖర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మౌలాలి స్వామి జార్తులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని ఈర్నపాడు గ్రామంలో మౌలాలి స్వామి జార్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. మొక్కుబడులు ఉన్న వారు కందూర్లు చేసి ప్రజలకు అన్నదానం చేశారు. **మహానంది :** మహానంది మండల పరిధిలోని మజరా గ్రామపంచాయతీ గాజులపల్లె గ్రామంలో మొహరం పండుగ ముగింపు సందర్భంగా మౌలాలి స్వామి జార్తులు వేడుకలు వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, ఆధ్వర్యంలో మౌలాలి స్వామికి ప్రత్యేక ఫాతెహాలు, గంధాన్ని సమర్పించారు. పీర్ల చావిడి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మౌలాలి స్వామి పీరుకు దట్టీలు, పూల సూచికలు, హస్తాలు, గొడుగులు, ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి నుండి ఉదయం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మౌలాలి స్వామి పీరు ఊరేగింపులో వేలాది సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నంద్యాల తాలూకా రూరల్ సీఐ రవీంద్ర, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

మహానంది : గాజులపల్లె గ్రామంలో మౌలాలి స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

(5వ పేజీ తరువాయి..) నాగేశ్వరరావు, కరిముల్లా, రామాంజనేయులు, సిద్దయ్య, రాజు, మహబూబ్ బీ, సువర్ణమ్మ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, సంక్షేమ పథకాలు, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగురాజు, ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు నాయకులు సద్దాం, మున్సిపల్ కార్మికులు దానమయ్య, వినోద్, రవి, నాగన్న, రామకష్ణ, రాజేంద్ర, శిఖమని, స్వాములు, జయన్న, సుశీలమ్మ, జీవరత్నమ్మ, సువరణమ్మ, సామక్క, రూతమ్మ, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు నాయకులు పరమేష్ అధ్యక్షతన నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కే.భాస్కర్ రెడ్డి, టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం పలు [illegible] రకాల డిమాండ్లతో మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నాగన్న, శ్రీను, అబ్రహం, విజయ్, బాశిక్, సత్యరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకటయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు, పాదయాత్రలో మున్సిపల్ కార్మికులను, అవుట్సోర్సింగ్ ఉద్యోగులను తాను అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోపు వారిని పర్మినెంట్ చేస్తానని హామీనిచ్చారన్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీతకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాల్మోను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

నందికొట్కూరు : మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆళ్లగడ్డ : మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జగనన్న సురక్ష పేదలకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

జగనన్న సురక్ష పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జులై 1న ప్రారంభించినట్లు తెలిపారు. నెలరోజుల పాటు రాష్ట్రంలోని అన్ని సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం నిర్వహించామన్నారు. వాలంటరీలు తమ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించి పంపిణీ చేసినట్లు తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో 82 గ్రామ సచివాలయాల పరిధిలో 91,965 కుటుంబాలను వాలంటీర్లు కలిసి 49,254 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో బనగానపల్లె మండలంలో 21,253 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేసి జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో బనగానపల్లె మండలంలోని ఇల్లూరు కొత్తపేట సచివాలయం 2099 సర్టిఫికెట్లను పంపిణీ చేసి జిల్లాలోనే మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. పేద ప్రజలు వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించు కోవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, యాగంటి దేవస్థానం ఛైర్మన్ తోట బుచ్చిరెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్ అత్తార్ జాహిద్ హుస్సేన్, కోడూరు రామచంద్రారెడ్డి, మీరాపురం మనోహర్ రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ సాదుల శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఆళ్లగడ్డలో పులి సంచారం అవాస్తవం

- స్పష్టం చేసిన అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని సత్రం వీధిలోని దాల్‌మిల్లు సమీపంలో సోమవారం రాత్రి చిరుతపులి సంచరించినట్లు వచ్చిన వార్తలు అవాస్తవాలని రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అటవీ శాఖ అధికారి శ్రీనివాసుల రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానికులు కొందరు తాము చిరుతపులిని ప్రత్యక్షంగా చూసినట్లు పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆళ్లగడ్డ టౌన్ సిఐ రమేష్ బాబు, సిబ్బంది, అటవీశాఖ అధికారులు సిబ్బంది గత రాత్రి దాలుమిల్లు పరిసరాలను మొత్తం పరిశీలించగా ఎక్కడ కూడా పులి సంచరించిన అడుగు జాడలు, ఇతరత్రా అనవాళ్లు లభ్యం కాలేదన్నారు. స్థానికులు ఒకవేళ జంగుపిల్లిని చూసి పులిగా భ్రమపడి ఉండవచ్చన్నారు. నల్లమల అటవీ ప్రాంతం ఇక్కడికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల అక్కడినుండి పట్టణంలోకి పులి ప్రవేశించే అవకాశం ఏమాత్రం లేదనిస్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రజలెవరు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు ఆదేశాల మేరకు తమ సిబ్బంది పరిసర ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మాట్లాడుతున్న శ్రీనివాసుల రెడ్డి

జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామ సమీపంలో 8 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుండి రూ. 16,200 నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ నమోదు ప్రక్రియ

- సబ్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - రుద్రవరం

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో బూత్ లెవెల్ అధికారులు ఓటర్ నమోదు సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని నంద్యాల సబ్ కలెక్టర్, ఆళ్లగడ్డ ఎన్నికల పర్యవేక్షణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని నరసాపురం ,ఆర్ నాగులవరం, కొండమాయపల్లె గ్రామాలలో బూత్ లెవెల్ అధికారులు చేపడుతున్న ఓటర్ నమోదు సర్వే ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఓటర్ నమోదు సర్వే ప్రక్రియ ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని, 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులను గుర్తించి వారికి కొత్తగా ఓటరు నమోదు చేయించాలని, తప్పులు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలన్నారు. తహసిల్దార్ రవీంద్ర ప్రసాద్ వీఆర్వోలు ఓబయ్య, పుల్లయ్య, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

రుద్రవరం : ఓటర్ నమోదు సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీనివాసులు

రాజకీయ పార్టీలతో సబ్ కలెక్టర్ సమీక్ష సమావేశం

ఆళ్లగడ్డ : పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల జాబితాపై అన్ని రాజకీయ పార్టీల బూత్ కమిటీ సభ్యులు, నియోజకవర్గంలోని మండలాల తాహసిల్దార్లతో సబ్ కలెక్టర్ శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులను ఓటరు జాబితాలో ఎన్రోల్ చేయాలన్నారు. ప్రతి మంగళవారం సర్వే పూర్తయ్యే వరకు సమావేశం నిర్వహిస్తామన్నారు. సర్వే అనంతరం తుది ఓటర్ జాబితా రూపొందిస్తామని పేర్కొన్నారు. తహశీల్దార్లు హరినాథ్ రావు, షేక్ మొహిద్దిన్, రవీంద్ర ప్రసాద్, రవికుమార్, ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎంపిడివో మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సిఎం విఫలం

- విఆర్ఎల సంఘం

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్ అన్నారు. మంగళవారం బేతంచర్లలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో విఆర్‌ఏలకు రూ.6,500 నుండి రూ.10,500 వరకు జీతం పెంచారని తెలిపారు. టిఏ రూ. 50 నుండి రూ. 100, డిఏ రూ.100 నుండి రూ. 300 పెంచారని, గ్రేడ్-1 ప్రమోషన్ ఇచ్చి 45 రోజులు సర్వే ట్రైనింగ్ ఇచ్చేవారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక దానిని తొలగించడం దారుణమన్నారు. దుర్మార్గమైన విషయం ఒక్కొక్క వీఆర్‌ఏ నుంచి రూ.19,200 రికవరీ చేశారని, రికవరీ కట్టని మండలాల్లో విఆర్‌ఏలకు సంబంధిత అధికారులు 4, 5 నెలలైనా జీతాలు ఇవ్వకుండా వేధించడం బాధాకరమన్నారు. పండగపూట కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వీఆర్‌ఏలకు అది పెంచాం, ఇది పెంచామని గొప్పలు చెప్పుకోవడం, పేపర్‌లో రాసుకోవడం తప్ప ఏ ఒక్క హామీని ఇంతవరకు నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికైనా టిఏ, డిఏ పెంచాలని, రికవరీలు రద్దు చేసి వారి పేమెంట్ పే స్కేల్‌ను యధావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చెయ్యని పక్షంలో 2024లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వీఆర్‌ఏలు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు వై.ఎల్లయ్య, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

పండ్ల తోటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా అంబుడ్స్‌మెన్ డా.ఆర్. సురేంద్ర కుమార్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నందికొట్కూరు మండలం లోని వడ్డెమాను, కొనేటమ్మపల్లె, బొల్లవరం గ్రామాలలో చేపట్టిన కొబ్బరి, చీనీ, నిమ్మ పండ్ల తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పండ్లతోటలు సాగుచేసిన రైతులతో మాట్లాడారు. పండ్లతోటల సాగు ద్వారా వందశాతం సబ్సిడీని పొంది మంచి లాభాలు సాధించవచ్చన్నారు. రైతులకు అంతర పంటలు, మొక్కల సంరక్షణ గురించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీఓ అలివేలు మంగమ్మ, ఈసి షబానా, టీఏ ఉమేష్, ఆయా గ్రామాల ఫిల్డ్ అసిస్టెంట్ లు ఉన్నారు.

సైడు కాలువలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - సంజామల

మండల కేంద్రం సంజామలలోని గొల్లపేటలో సైడు కాల్వలు లేకపోవడంతో మరుగు నీరు నిలబడి దుర్వాసన వెదజల్లుతున్నదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు వృద్ధి చెంది దాడి చేస్తుండడంతో జ్వరాల బారిన పడుతున్నామని గొల్లపేట వీధి ప్రజలు తెలిపారు. సైడు కాల్వలు నిర్మించాలని అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చిన్న వర్షం పడినా నీరు నిలబడి దుర్వాసన వస్తోందన్నారు. ఇప్పటికైనా సైడు కాల్వలు నిర్మించి మురుగునీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు శివుడు, సంజీవ రాయుడు, లక్ష్మమ్మ, విజయమ్మ, హుస్సేనమ్మలు అధికారులను కోరారు.

నిలిచిన మురుగునీరు

సిమెంట్ రోడ్డుపై నీరు నిల్వ

- నడవాలంటే నరకమే - వర్షం వస్తే కాలనీ బురదమయం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని అర్బన్ కాలనీలోని తమ్మడపల్లె రోడ్డులో సిమెంట్ రోడ్డుపై నీళ్లు నిలిచి నడవడానికి నరకంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ప్రజలు బయటికి రావాలంటే మురుగునీరులో నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. కాలనీవాసులు మురుగు నీటిలో నడుస్తూ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో 150 ఇళ్లకు పైగా ఉన్నాయి. అధికారులు కొన్నిచోట్ల సిసి రోడ్లు వేశారు. కానీ మురుగు కాలువలను నిర్మించకపోవడంతో ప్రజలు వాడిన నీరు వర్షపు నీరు సిమెంట్ రోడ్లపై నిలిచి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ్మడపల్లె రోడ్డులోని సిసి రోడ్డుపై మురుగునీరు నిలిచి ప్రజలు తిరగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరులోనే నడిచి వెళ్ళవలసి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో సిసి రోడ్లు వేసి, మురుగు కాలువలను ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు, ప్రజలు వాడిన నీరు రోడ్లపై నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో దోమల బెడద, దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు బయటకు వెళ్లే విధంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిసి రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో శారదాబాయి

జిల్లాల్లో 81 కుష్టు వ్యాధి కేసుల నిర్ధారణ

ప్రజాశక్తి - చాగలమర్రి

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా జూన్ 26 నుంచి జులై 30వరకు జరిపిన సర్వేలో 53 కుష్టు వ్యాధి కేసులు నిర్ధారణ అయ్యాయని, ఏప్రిల్, మే నెలల్లో 28 కేసులు నిర్ధారణ అయ్యాయని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో శారదాబాయి తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. జిల్లాల్లో సర్వేలో నిర్ధారణ అయిన కుష్టువ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు ప్రారంభిస్తున్నామని వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంవో ప్రసాదు, వైద్యురాలు అంజలి, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు కార్డులు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

కౌలు రైతులు కౌలు కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఉన్న కౌలు రైతులు కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే విత్తనాలు ఎరువులకు, రాయితీలు అందవని చెప్పారు. పంట బీమా కూడా వర్తించదన్నారు. ఆయా గ్రామాల వీఆర్వోలను సంప్రదించి తక్షణమే కౌలు కార్డులు తీసుకోవాలని సూచించారు.

శ్రావణమాసంలో సౌకర్యమైన దర్శనం : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో శ్రావణమాసంలో భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శనార్థమై క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, బిస్కెట్లు, అల్పాహారం అందించాలని సూచించారు. ముఖ్యంగా సెలవు దినాల్లో, పర్వదినాల్లో, శని, ఆది, సోమవారాలలో భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందుగానే చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని సాయంత్రం కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. లడ్డు ప్రసాదాలను తక్కువ కాకుండా భక్తులకు అడిగిన ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వడ ప్రసాదాన్ని కూడా భక్తులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రావణమాసంలో తెల్లవారుజామున మూడు గంటలకి ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం దర్శనానికి అనుమతిని ఇవ్వాలని తెలిపారు. మధ్యాహ్నం విరామం అనంతరం దర్శనం కొనసాగించాలన్నారు. సాయంత్రం తిరిగి ఐదున్నర గంటల నుండి రాత్రి 11 గంటల వరకు భక్తులకు దర్శనానికి అనుమతిని ఇవ్వనున్నట్లు చెప్పారు. శ్రావణమాసంలో కూడా సాధారణ రోజుల వలె స్పర్శ దర్శనం, మంగళ, బుధ, గురు, శుక్రవారాలలో మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు ఆలయంలోకి ప్రవేశించిన వారికి స్పర్శ దర్శనం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. శ్రావణమాసంలో రెండుసార్లు వరలక్ష్మి వ్రతం, ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. రెండవ శుక్రవారం 750 మందికి, అందులో 250 మంది తెల్ల రేషన్ కార్డు కలిగిన ముత్తైదువులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కస్తూర్బా స్కూల్లో ఇంటర్ ప్రవేశాలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని కస్తూర్బా స్కూల్లో ఇంటర్మీడియట్ ఎంపిసి గ్రూపులో చేరేందుకు విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్చార్జి ఎస్ఓ మహబూబ్ జాన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఎస్ఒ మాట్లాడుతూ పదవ తరగతి పాస్ అయిన విద్యార్థినిలు కొలిమిగుండ్లలోనే కస్తూర్బా స్కూల్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో చేరేందుకు మొదటి సంవత్సరం రెండవ సంవత్సరం అవకాశం కల్పించినట్లు చెప్పారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం మండలం మోడల్ స్కూలులో మంగళవారం ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు అధ్యక్షతన ఏపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది పి.బాలస్వామి బీజామృతం తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజామృతం ఎలా తయారు చేసుకోవాలి, ఉపయోగాలపై డెమో క్లాస్ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, అగ్రికల్చర్ విటి శ్రీకల, రుద్రవరం మండల యూనిట్ ఇంఛార్జి బాలస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమంగా తగ్గుతున్న నీటి ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుండి క్రమంగా నీటి ప్రవాహం తగ్గుతుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదనతో 42,013 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 886 క్యూసెక్కులతో కలిపి 42,899 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నాయి. అదే సమయానికి జలాశయ నీటిమట్టం 852.30 అడుగులుగా, నీటి నిల్వ సామర్థ్యం 85.2060 టిఎంసిలుగా నమోదయింది. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించలేదు.

టిడిపి నాయకుడు మృతి

- నివాళులర్పించిన బిసి ఇందిరా

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని చెరువు పల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఇటిక్యాల సుబ్బరాయుడు(65) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా గ్రామానికి వెళ్లి సుబ్బరాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె వెంట గ్రామ టిడిపి నాయకులు వెంకటసుబ్బయ్య, మద్దిలేటి, షేక్షావలి తదితరులు ఉన్నారు.

స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె గ్రామ సమీపంలో గల నేలబెలుం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారికి పౌర్ణమి పూజలను మంగళవారం భక్త బృందం ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబ,మల్లికార్జున స్వామి వార్లకు విశేష అలంకారాలు నిర్వహించారు. సాయంకాలం బందార్లపల్లె గ్రామస్తులు కడప, కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు పాల్గొని పల్లకి సేవ నిర్వహించారు. బందార్లపల్లెకు చెందిన చంద్రహాస్ రెడ్డి పూజా కార్యక్రమాల నిర్వహణకు తమవంతు సహకారం అందించారు.

నాటుసారా, బైకు స్వాధీనం

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలం కొండమనాయన పల్లె గ్రామానికి చెందిన బానావత్ రామ పుల్లయ్య నాయక్ బైక్‌పై 30 లీటర్ల సారాయిని తరలిస్తుండగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సెబ్ సిఐ సుభాషిణి మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఉప్పలపాడు నుండి కొండమ నాయన పల్లె వరకు రూట్ వాచ్ నిర్వహిస్తుండగా మార్గమధ్యలో బైక్‌పై వెళుతున్న బనావత్ రామ పుల్లయ్య నాయక్‌ను ఆపి ప్లాస్టిక్ సంచిలో తనిఖీ చేయగా 30 లీటర్ల నాటు సారా దొరికిందన్నారు. సారాను, బైకును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించామన్నారు. ఈ తనిఖీల్లో బనగానపల్లె సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో గుంతలు పూడ్చిన హోంగార్డు

ప్రజాశక్తి - బనగానపల్లె : గుంతలు పడ్డి అధ్వానంగా ఉన్న రోడ్డులో ప్రమాదాలు జరగకుండా హొంగార్డు రంగన్న సొంత ఖర్చులతో సిమెంటు, కంకర కొనుగోలు చేసి గుంతలను పూడ్చి ఆదర్శంగా నిలిచారు. మంగళవారం పట్టణంలోని కొండపేట సుంకులమ్మ గుడి టర్నింగ్ వద్ద రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు పడుతున్న ఇబ్బందులను హోంగార్డు గమనించారు. హోంగార్డు రంగన్న తన సొంత ఖర్చులతో సిమెంటు కంకర ను తెచ్చి గుంతను పూడ్చారు. దీంతో హోంగార్డును పలువురు వాహనదారులు అభినందించారు.

గుంతలు పూడ్చుతున్న హోంగార్డు రంగన్న

మహారాజశ్రీ గౌరవ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నందు

Creditor IP : 45/2022

1. గోపవరం హైమావతమ్మ
2. చిన్రెడ్డి కృష్ణ వేణి
3. పల్లె విజయలక్ష్మి. ...Petitioners

V/s

1.బావికాడి హుస్సేని @ నడిపి హుస్సైన్ @ హుశ్సేని
S/o హుస్సేని
R/ o H.No: 1-6-5, B.C కాలనీ,
గోస్పాడు గ్రామము & మండలము,
నంద్యాల జిల్లా.
2. కొండుపల్లి హుస్సేనయ్య
S/o హుస్సేనయ్య
R/o గోస్పాడు గ్రామము & మండలము,
నంద్యాల జిల్లా. ...Respondents

1వ రెస్పాండెంట్ కు నోటీసు

మహారాజశ్రీ గౌరవ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నందు పై అర్జీదారులు, 1వ రెస్పాండెంట్ ను IP దారుడుగా తీర్మానించవలసినదిగా కోరుచూ మరియు 1వ రెస్పాండెంట్, 2వ రెస్పాండెంట్ కు వ్రాసిచ్చిన విక్రయదస్తా వేజును రద్దు చేయమని అర్జీ దాఖలు చేయడమైనంది. గౌరవ కోర్టు వారు 1వ రెస్పాండెంట్ కు పలుమార్లు నోటీసు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు ఇవ్వడమైనది. కావున ఈ విశయమై ఆక్షేపనలు ఉన్నఎడల గౌరవ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నందు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ 31-08-2023 తేదీన ఉదయం 10-30 ని॥లకు హాజరుఅయ్యి తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు ఈ పిటిషన్ తీర్మానిచెదరని ఇందుమూలముగా తెలియజేయదమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 31-08-2023

ఇట్లు
ప్రభాకర రెడ్డి. దాట్ల
పిటిషనర్ల అడ్వొకేటు, ఆళ్లగడ్డ.
Cell: 9399993323



జిల్లా సమగ్రాభివృద్ధికి పోరు

- నేటి నుంచి సిపిఎం మహా పాదయాత్ర - ఆరు రోజుల పాటు సాగనున్న యాత్ర

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరుబాట సాగనుంది. బుధవారం నుంచి సిపిఎం ఆధ్వర్యంలో ఆదోని నుంచి కర్నూలు వరకూ మహా పాదయాత్ర చేపట్టనున్నారు. ఆరు రోజుల పాటు ఈ యాత్ర సాగనుంది...

జిల్లా నుంచి ఎందరో రాజకీయంగా అత్యున్నతమైన ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులుగా ఎన్నో పదవులు పొందారు. అయినా కర్నూలు జిల్లా అభివృద్ధికి చేసింది శూన్యం. జిల్లాలో ఒక్క పరిశ్రమ లేదు. సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు లేవు. విద్య, వైద్యంలో జిల్లా వెనకబాటుతనంలో ఉంది. సహజ వనరులు ఎన్ని ఉన్నా పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధిలో జిల్లా అట్టడుగున ఉంది. పాలకులకు పదవులు తప్ప జిల్లా అభివృద్ధి ఏ మాత్రం పట్టలేదు. నిద్ర నటిస్తున్న పాలకులను తట్టి లేపి, సాగునీటిలో న్యాయమైన వాటా రాబట్టుకునేందుకు, జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో పోరు బాట సాగనుంది. మహా పాదయాత్ర పేరుతో ఆదోని నుంచి కర్నూలు వరకూ పాదయాత్ర చేపట్టనున్నారు. బుధవారం ఆదోనిలో ప్రారంభమయ్యే పాదయాత్ర 7న జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నాతో ముగియనుంది. మహాపాదయాత్ర జయప్రదానికి ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు, జీపు జాతాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టే మహా పాదయాత్రలో మేధావులు, కార్మికులు, కర్షకులు, యువతీ, యువకులు, మహిళలు, దళితులు, మైనార్టీలు భాగస్వామ్యం కావాలని సిపిఎం జిల్లా కమిటీ కోరింది.

పాదయాత్ర సాగనుందిలా..

ఆగస్టు 2 : ఆదోని నుంచి బనవాసి ఫారం వరకు.
ఆగస్టు 3 : బనవాసి ఫారం నుంచి గోనేగండ్ల వరకు.
ఆగస్టు 4 : గోనేగండ్ల నుంచి కోడుమూరు వరకు.
ఆగస్టు 5 : కోడుమూరు నుంచి నాగలాపురం వరకు.
ఆగస్టు 6 : నాగలాపురం నుంచి పెద్దపాడు వరకు.
ఆగస్టు 7 : తాజ్ ఫంక్షన్ హాల్ నుంచి ర్యాలీ, కలెక్టరేట్ ముందు మహా ధర్నా.

డిమాండ్లు ఇలా...

- కర్నూలు జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలి.
- జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.8వేల కోట్లు కేటాయించి పనులు ప్రారంభించాలి.
- హంద్రీనీవా కాల్వ వెడల్పు పనులకు నిధులు ఇచ్చి పూర్తి చేయాలి. పంట కాలువలను తవ్వాలి.
- రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకోవడానికి మండలానికి ఒక శీతల గిడ్డంగిని నిర్మించాలి.
- జిల్లాలో ప్రభుత్వ రంగంలో భారీ పరిశ్రమలు నిర్మించాలి. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో ఐటి, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి. రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ వెంటనే పూర్తి చేయాలి.
- జిల్లాలో పాడైపోయిన రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.
- కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలి. ఆదోనిలో 300 పడకలు, ప్రతి మండలంలో 50 పడకల ఆస్పత్రులను నిర్మించాలి.
- జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాలన్నిటినీ సంవత్సరంలోపు పూర్తి చేయాలి.
- జిల్లా కేంద్రం కర్నూలు నుంచి విజయవాడకు కొత్త రోడ్డు, రైలు మార్గాలు వేయాలి. రెగ్యులర్ రైళ్లు నడపాలి.
- పత్తికొండలో టమోటా జూస్, సాస్ పరిశ్రమను నిర్మించాలి.
- రాయలసీమ, ఉర్దూ యూనివర్సిటీల అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించి ఫ్యాకల్టీలను నియమించాలి. ప్రతి మండలంలో డిగ్రీ కాలేజీకి స్వంత భవనం నిర్మించి సిబ్బందిని కేటాయించాలి.
- ఆదోని, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్, లెదర్ పార్కును నిర్మించాలి.
- జొన్నగిరి దగ్గర బంగారు గనుల పరిశ్రమను ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వ, బంజరు, మిగులు భూములు పేదలకు పంచాలి.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరానికి 200 రోజులు పని ఇవ్వాలి. రోజుకు రూ.600 కూలి ఇవ్వాలి.
- అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి. వారికి పని భద్రత కల్పించాలి.
- స్కీం వర్కర్లకు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలి.
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బిసి వర్గాలకు సామాజిక భద్రత కల్పించాలి. కాటికాపరి వృత్తిని గుర్తించి వేతనం ఇవ్వాలి.
- అన్ని రకాల వృత్తిదారులకు కార్పొరేషన్ల ద్వారా సహకారం అందించి ఆదుకోవాలి.
- విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.
- ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కలెక్టరేట్ ఎదుట విద్యుత్ ఉద్యోగులు ధర్నా

– విద్యుత్ సౌద నుంచి కలెక్టర్‌కు భారీ ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అవుట్‌సోర్సింగు , కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు విద్యుత్ సౌదనుంచి కొత్తబస్టాండు, రాజ్‌విహార్ సెటంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. పెద్దపెట్టున నినాదాలతో కర్నూలు నగరం మారుమోగించించారు. ఎఇ అసోసియేషన్ నాయకులు అంకం మహేశ్వరరావు, ఇంజనీరింగ్ సెక్షన్ నాయకులు గంగన్న, 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, రంగస్వామి, శివకుమార్, విరూపాక్షి రెడ్డి హుస్సేన్, ప్రసాద్, రామరాజు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ,నేరుగా జీతాలు ఇవ్వాలని ,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి ఒకటి నుండి 2034 ఆగస్టు 31మధ్య నియామకమైనటువంటి ఉద్యోగులకు ఇపిఎఫ్ నుండి జిపిఎఫ్‌ను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అమలు చేయాలన్నారు. జెఎల్‌ఎం గ్రేడ్ 2 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పెండింగుతో ఉన్న కారుణ్య నియామకాలు అమలు చేయాలన్నారు. పెండింగు డిఎ బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని కోరారు. ఏకసభ్య కమిషన్‌ను రద్దుచేసి పిఆర్‌సి 2022ను వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్‌సిలు పిపిలు లేకుండా అందరికీ ఒకే మాస్టర్ స్కేల్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే ఆగస్టు 10న నిరవధిక సమ్మెలోకి వెళ్ళనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు ఎపి ఎస్‌పిడిసిఎల్, ఎపి ట్రాన్స్‌కో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పచ్చి మిర్చి రైతులను ఆదుకోవాలి

- కె ప్రభాకరరెడ్డి ప్రధాన కార్యదర్శి ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పచ్చి మిరప పంటను సాగు చేసి నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా అదుకోవాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌వి. నాగేశ్వరరావును ఎపి రైతుసంఘం ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డితోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి, జి. రామకృష్ణ, జిల్లా నాయకులు రామకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేశ్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా కె ప్రభాకర్‌రెడ్డి, జి.రామకృష్ణ మాట్లాడుతూ వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట, నర్పరాజపురం, కలుగొట్ల, బోయినపల్లి, నరసాపురం, పుల్లగుమ్మి గ్రామాలలో వేలాది ఎకరాలలో ఈ ఏడాది నర్సరీలు నుండిపచ్చిమిరపను ఒక్కో మొక్క రూ.70నుంచిరూ.80పైసలకు కొనుగోలు చేశారన్నారు. ఒక్క రామళ్లకోటగ్రామంలోనే దాదాపుగా 2వేల ఎకరాలసాగుచేయగా దాదాపుగా రూ.10కోట్లు నష్టపోయారన్నారు. పచ్చిమిరప సాగు చేసినష్టపోయిన రైతులకుఎకరాకు రూ.50వేల పరిహారం ఇచ్చి అదుకోవాలన్నారు. లైసెన్సు లేకుండా నర్సరీలను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమాజ మార్పునకు ప్రజాశక్తి అవసరం

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, గౌస్‌దేశాయి, పుల్లయ్య, సుబ్బారెడ్డి, రసూల్ తదితరులు

- వాస్తవాల సమాహారం ప్రజాశక్తి
- 43వ వార్షికోత్సవ సభలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వాస్తవాల సమహారం ప్రజాశక్తి అని అలాంటి పత్రిక సమాజానికి ఎంతో అవసరమని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. మంగళవారం కర్నూలు ఎంపిపి సమావేశ మందిరంలో ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ అబద్దాలను నిజాలుగా మార్చి రాసే పత్రికలు మీడియా ఉన్న నేటి సమాజంలో ఎన్నో ఇబ్బందులను ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ వాస్తవాలే పరమావధిగా ప్రజాశక్తి పని చేస్తుందని అన్నారు. పార్టీలను అనుసరిస్తూ పత్రికలు వెలుస్తున్నాయన్నారు. కచ్చితత్వం విమర్శన ధోరణితో విశ్లేషణాత్మకంగా కథనాలు, వ్యాసాలు ప్రజాశక్తి ఇస్తుందన్నారు. నిజాయితీ గురించి చెప్పడం కన్నా ఆచరించడం చాలా కష్టమన్నారు. అందుకు తన రాజకీయ జీవితంలో జరిగిన సంఘటనలు, అనుభవాలే నిదర్శనం అన్నారు. ప్రయివేటు కళాశాలల అధ్యక్షులు వాసుదేవయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, తాండ్రపాడుసర్పంచి బాలపీర శుభాకాంక్షలు తెలిశారు. ప్రజాశక్తిడెస్క్ ఇంచార్జి పానుగంటి చంద్రయ్య వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. జిల్లా ఇన్చార్జి ఎం.రాజు, సర్కులేషన్ ఇన్‌ఛార్జి ఎస్ఎండిబాష, ప్రింటింగు యూనిట్ఇన్‌చార్జి మంగయ్య, డివిజన్ ఇన్చార్జి ఎల్లాగువేరా, సబ్ఎడిటర్స్ మాసుం, అయ్యస్వామి, సిబ్బంది, విలేకరులు, పాల్గొన్నారు.

నిజాయితీ పత్రికలకు రక్షణ కరువు

- డి.గౌస్ దేశాయి, సిపిఎం జిల్లా కార్యదర్శి

దేశంలో నిజాయితీగా పనిచేసే పత్రికలకు రక్షణ లేదు. బిజెపి, ఆర్ఎస్ఎస్, లాంటి మతోన్మాద సంస్థలు పార్టీలు అభ్యుదయ పత్రికలపై మీడియాపై ప్రభుత్వ విచారణ సంస్థలను అడ్డుపెట్టుకొని ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. లొంగని వారిపై ఏకంగా దాడులకు హత్యలకు తెగబడుతున్నారు. కొన్ని పత్రికలు పాలకులకు దాసోహమై పనిచేస్తున్నాయి. మణిపూర్ మారణహోమంపై ప్రస్తావించని పత్రికలు మీడియా అందుకు నిదర్శనం. జిల్లాలో సిపిఎం 56 గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో 75 శాతానికి పైగా గ్రామాలకు 15 రోజులకు ఒకసారి మాత్రమే మంచినీళ్లు అందుతున్నాయి. ఇలాంటి ఎన్నో వాస్తవాలను ప్రజాశక్తి పత్రిక తెలుగులోకి తెస్తుంది.

నిజాలు రాసే పత్రికలు ప్రజాశక్తి, విశాలాంధ్ర

- సిపిఐ జిల్లా నాయకులు రసూల్

సిపిఐ జిల్లా నాయకులు రసూల్ మాట్లాడుతూ మణిపూర్లో మూడు నెలల నుంచి ధమనకాండ జరుగుతున్నా ప్రధానమంత్రి ఏమాత్రం నోరు మెదపలేదన్నారు. సంబంధిత వార్తలు వెలుగు చూడకుండా మోడీ మీడియాను కట్టడి చేశారన్నారు. ప్రజల పక్షాన నిలబడి నిజాలను రాసే పత్రికలు ప్రజాశక్తి, విశాలాంధ్ర మాత్రమేనన్నారు.

మంచిని ప్రోత్సహించే పత్రిక ప్రజాశక్తి

- జి.పుల్లయ్య ,ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

మంచిని ప్రోత్సహిస్తూ కీడును వ్యతిరేకిస్తూ పనిచేసే పత్రిక ప్రజాశక్తి. నిక్కచ్చితత్వ వార్తలను రాస్తుంది. సామాన్యుల జిడిపి అసలైన జిడిపి అని కానీ కొన్ని పత్రికలు మీడియా కార్పొరేట్ల జిడిపిని చూపి దేశ జిడిపిగా ప్రజలను భ్రమలో నెడుతున్నాయి. దేశంలో 80శాతం యువశక్తి అందుబాటులో ఉన్న వారికి సరైన అవకాశాలు లేక తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన దుస్థితి ఎదురవుతుంది. ఉపాధి చూపే పరిశ్రమలు రావాలి. రాష్ట్ర బడ్జెట్ ఖర్చులో కేవలం 10 శాతం ఖర్చుచేసినా జిల్లాకు సాగునీరు అందించవచ్చు. లోతైన వాస్తవాలను వెలుగులోకి తెచ్చే పత్రికగా ప్రజాశక్తి నిలుస్తుంది.

తప్పులను ఎత్తిచూపే పత్రిక ప్రజాశక్తి

- కెవి.సుబ్బారెడ్డి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం సంస్థ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

ఏ ప్రభుత్వమయినా ప్రజలకు, యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా విధానాలు రూపొందించాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆరోగ్య అవసరాలకు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించాలి. పాలకులు చేసే తప్పులను ఎత్తిచూపడంలో ప్రజాశక్తి ముందు వరుసలో ఉంటుంది.

మీడియాను, రాజకీయాలను శాసిస్తున్న పెట్టుబడిదారులు

- టి.నరసింహా , ప్రజాశక్తి జనరల్ మేనేజర్

ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ మాట్లాడుతూ అంతర్జాతీయ పెట్టుబడి కంపెనీలకు లోబడి పత్రికలు మీడియా పనిచేస్తున్నాయి. కార్పొరేటర్ శక్తులే రాజకీయాలను శాసిస్తున్నాయి. చట్టాలను వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. వర్గ దక్పథంలో భాగంగా సామాన్యులు మహిళలు ఎస్‌సి, ఎస్‌సి, బిసి, మైనార్టీ, బలహీన వర్గాలకు పత్రిక అండగా నిలుస్తుంది.

వాస్తవాల పత్రిక ప్రజాశక్తి

- నగరూరు శమంతకమణి , మార్కెట్ యార్డు మాజీ చైర్మన్

ప్రజాశక్తి వాస్తవాలను నిజాయితీగా నిబద్ధతతో సేకరించి రాస్తుంది. ప్రజాశక్తి తో మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. మా కుటుంబంలో ప్రజాశక్తి ఒక భాగం. జిల్లాలో విభజన అనంతరం సర్వం కోల్పోయి పోయింది. జిల్లా అభివద్ధి కోసం ప్రజాశక్తి మరిన్ని కథనాలు రాయాలి.

అభివృద్ధికిని కాంక్షించే పత్రిక ప్రజాశక్తి

- ఆర్థిక విశ్లేషకులు మన్‌సూర్ రహ్మాన్

ఒకప్పుడు రామళ్లకోట పత్తికొండ తాలూకా కేంద్రాలుగా ఉండేవి. అలాంటివి అభివద్ధి నోచుకోకుండా వెనుకబడ్డాయి. కొన్ని వర్గాలను, ప్రాంతాలను పాలకులు నిర్లక్ష్యం చేసినట్లుగా కొన్ని గ్రామాలను, పట్టణాలను పట్టించు కోలేదు. జిల్లా అభివద్ధిని కాంక్షిస్తూ ప్రజాశక్తి అనేక కథనాలు రూపొందించడమే కాకుండా కార్యాచరణ దిశగా అడుగులు వేస్తుంది.

కర్నూలు అభివృద్ధికి కథనాలు రాయాలి

- క్రెడాయి రాష్ట్ర నాయకులు నగరూరు శ్రీనివాసరావు

జిల్లా విభజనలో కర్నూలు సర్వం కోల్పోయింది. జిల్లాలో నూతన పరిశ్రమలు వచ్చినప్పుడే జిల్లా అభివృద్ధి చెందుతుంది. జిల్లా అభివద్ధిలో రియల్ ఎస్టేట్ రంగం ఎంతోమందికి ఉపాధిని కల్పిస్తూ అభివృద్ధిలో పునాదిగా నిలుస్తోంది. ప్రజాశక్తి దినదినాభివద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ప్రజాశక్తితో విడదీయరాని బంధం

- పిబివి.సుబ్బయ్య,ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ మాజీ అధ్యక్షులు

ప్రజాశక్తితో నాకు విద్యార్థి దశ నుంచి చక్కని అనుబంధం కలిగి ఉంది. ప్రజాశక్తి తో పాటు అందులో పని చేసే సిబ్బంది అంకితభావంతో పనిచేస్తారని చెప్పారు.మాది విడదీయరాని బంధం.

వాస్తవాల కోసం ప్రజాశక్తి చదవాలి

ఆదిమూలపు సతీస్, మైపర్ విద్యాసంస్థల డైరెక్టర్

రాజకీయాలకు వచ్చినప్పటినుంచి ప్రజాశక్తి పత్రిక నిత్యం చదువుతున్నాను. వాస్తవాలు తెలువాలంటే ప్రజాశక్తి చదవాలని నిర్ధారించుకున్నాను. పత్రిక అభివృద్ధికి నాతోడ్పాటునందిస్తాను.

మహాళల పోరుయాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఐద్వా నాయకులు నిర్మ, ఎన్ అలివేలు, ధనలక్ష్మి తదితరులు

మహిళల పోరుయాత్ర గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :

ఈనెల 28 నుండి ఆగస్టు 9 వరకు హింసపై మహిళల పోరు బస్సుయాత్ర ను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మల, ప్రధాన కార్యదర్శి, ఎన్.అలివేలు కోరారు. మంగళ వారం కర్నూలు సుందరయ్య భవన్‌లో మహిళా పోరు యాత్రకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దేశంలోనూ రాష్ట్రంలోనూ మహిళలపై హింస రోజు రోజుకి విపరీతంగా పెరిగిపో తుందన్నారు. మల్ల యోధులు ఢిల్లీలో చేసిన ఆందోళన ఒక నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉండడం చేత హింస పెరిగిపోతుందన్నారు. కేంద్రం మతం పిచ్చిలో భారత దేశాన్ని సర్వనాశనం చేస్తూ మణిపూర్ లో మహిళలలను నగ్నంగా ఊరేగించి అత్యాచారాలు, హత్యలు చేస్తూ తగలబెట్టినా నరేంద్ర మోడీ నోరు మెదపకుండా ఉండడం ప్రధాని పదవికే తలవంపు అన్నారు. చిన్న పిల్లలు మొదలుకొని వయోవృద్ధుల వరకు అత్యా చారాలు జరగడానికి రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మడమేనని అన్నారు. ప్రభుత్వాలు హింసను అరికట్టేందుకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మహిళల పోరు యాత్ర చేపట్టిందని చెప్పారు. మహిళలకు చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. నింది తులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారణ జరిపి కఠినమైన శిక్షలు విధించాలన్నారు. హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలను, టివి సీరియల్స్‌ను ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలన్నారు. అందుకు మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కాలేజీల్లో పని ప్రదేశాల్లో వేధింపులు నిరోధక అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేసి అమలు చేయాలన్నారు. ఆగస్టు 9న విజయవాడలో భారీ సభ నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని, అందుకు ఆర్థికంగా, అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఐద్వా ఉపాధ్యక్షురాలు జి. ధనలక్ష్మి, కోశాధికారి పిఎస్.సుజాత, కిరణ్మయి, షబానా, కెఎస్. పద్మ, శిరీష, రుద్రమ్మ, ఓల్డ్ టౌన్ అధ్యక్షురాలు రషీదా, అమీనా పాల్గొన్నారు.

కెడిసిసిబి చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లా కెడిసిసి బ్యాంక్ చైర్మన్ గా నూత నంగా ఎన్నికైన ఎస్వీ విజయ మనోహరిని కోడుమూరు శాసనసభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ మంగళవారం బొకే ఇచ్చి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్లు వినయ్ కుమార్ రెడ్డి, శేషి రెడ్డి, గోపాల్ రెడ్డి, ఎల్లరెడ్డి, వంశీ రెడ్డి, వైసిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి, శివ, కోటేశ్వర రెడ్డి ,నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి- సి బెళగల్

సిబెళగల్ మండలం పోలకల్‌లో సచివాలయాలను ఎంపిడిఒ రాముడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పని తీరును, పథకాల పర్యవేక్షణను ఆరా తీశారు.వేళలు పాటించి ప్రజలకు సేవలను సక్రమంగా అందించాలని పేర్కొన్నారు. పథకాల అమలు క్షేత్రస్థాయిలో చేపట్టాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన జిజిహెచ్ సూపరిన్‌టెన్‌డెంట్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వి. వెంకట రంగారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అంశాలపై పలు విషయాలను కలెక్టర్‌తో చర్చించారు. కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను కూడా కలిశారు. సిఎస్ ఆర్ ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా 4.38 లక్షల పత్రాలు

రెవిన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి. సృజన, జెసి మౌర్య

జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం 4,38,208 పత్రాలను ఉచితంగా అందించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జూలై 1 నుంచి 31 వరకు 25 మండలాలు, 4 మున్సిపాలిటీల పరిధిలో ఉన్న 672 సచివాలయలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, సచివాలయం స్థాయి అధికారులు అందరూ టీంగా ఏర్పడి పూర్తి స్థాయిలో విజయవంతం చేశారన్నారు. ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత దగ్గరగా చేసే విధంగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు.. సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి ముందుగానే వెళ్లి వారికి కావాల్సిన సర్వీసులు ఏవైనా ఉన్నాయా అని తెలుసుకుని, సుమోటోగా వాలంటీర్ ద్వారా అప్లికేషన్ పెట్టించామన్నారు. వారం రోజుల తర్వాత ఆ సచివాలయంలోనే క్యాంపు ఏర్పాటు చేసి ఎంపిడిఒ .డిప్యూటీ తహశీల్దార్ ఒక టీంగా, తహశీల్దార్, ఇఒఆర్‌డి మరొక టీంగా ఏర్పడి సచివాలయ పరిధికి వెళ్లి ఏ సర్వీసెస్ అయితే రిజిస్టర్ చేశారో ఆ సర్వీసెస్‌కు సంబంధించిన సర్టిఫికెట్లు ప్రజలకు నేరుగా అందించామని తెలిపారు. 672 సచివాలయాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసి 4,38,208 వివిధ రకాల సర్టిఫికెట్లను అందించామన్నారు. వచ్చిన అప్లికేషన్స్ లో 98.48 శాతం సర్వీసులను ప్రజలకు ఎటువంటి సర్వీస్ ఛార్జ్ లేకుండా ఉచితంగా అందించామన్నారు.. మండల యంత్రాంగం వేగంగా, సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించారని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 1,98,520, ఇన్కమ్ సర్టిఫికెట్లు 1,89,580 తీసుకున్నారన్నారు.. ఇంతకుముందు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ తీసుకొని వాటిని పోగొట్టుకున్న వారికి మరల 12,633 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు జారీ చేశామన్నారు.. ఆర్ఓఆర్ 1(బి) సర్టిఫికెట్ లు 9,789, ఆధార్ కార్డులో నెంబర్ అప్డేట్ సర్వీస్ 4,442, కంప్యూటరైజేషన్ ఆఫ్ అడంగల్ సర్టిఫికెట్ 4,262 మందికి, పెళ్ళైన కారణం చేత గాని లేదంటే వివిధ కారణాల చేత గాని ఇంటి సభ్యుల స్విప్టింగ్ జరిగిన వారికి 717 కొత్త రేషన్ కార్డులు, రైస్ కార్డ్ స్విప్టింగ్ 647 తో పాటు ఇతర సర్వీసులు మొత్తం 4,38,208 అందించామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో సిపిఒ అప్పలకొండ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సబ్ కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - నందవరం

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మండలంలోని నందవరం, నాగలదిన్నె, ముగతి పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. మంగళ వారం తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఓటరు సవరణలో అభ్యంతరాలు, డబుల్ ఎంట్రీ ఓట్లు, డెత్ ఓట్లను పరిశీలించి, 18 ఏళ్లు నిండిన వారికీ కొత్తగా దరఖాస్తు చేయించే బాధ్యత బిఎల్ఓదేనని తెలిపారు. అలాగే ప్రతి ఓటరును ఆధార్‌తో కచ్చితంగా అనుసంధానం చేయాలని, అందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఎంపిడిఒ దశరథ రామయ్య, తహశీల్దార్ నిత్యానందరాజు, ఎంఇఒ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన...

ప్రజాశక్తి-ఆలూరు

కేంద్రాలను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున

పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణలో అభ్యంతరాలు, డబుల్ ఎంట్రీ ఓట్లు, డెత్ ఓట్లను పరిశీలించి బిఎల్ఒల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. తహశీల్దార్ రామాంజినేయులు, డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ బసన్న గౌడ్ పాల్గొన్నారు.

ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులుగా నరసింహులు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి గజమాల, శాలువాతో సన్మానం

ప్రజాశక్తి - కోసిగి

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మండలంలోని ఆర్లబండ సహకార సంఘం నూతన అధ్యక్షులుగా వైసిపి మండల సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాంపురంలోని ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి మండల నాయకుల సమక్షంలో శాలువా కప్పి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడారు. విధుల పట్ల అంకితభావంతో పని చేస్తూ, రైతులకు అందుబాటులో ఉంటూ, సేవలందించాలని సూచించారు. వైసిపి మండల నాయకులు, ఎంపిపి ఈరన్న, మాజీ జడ్‌పిటిసి మంగమ్మ, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్య రాజు, ఆదినారాయణ శెట్టి, చెన్నబసవ, చూడి బసిరెడ్డి, నాడిగేని నాగరాజు, కోఆప్షన్ సభ్యులు షౌకత్ వలీ పాల్గొన్నారు.

తెర్నేకల్‌లో శ్మశాన వాటిక పునరుద్ధరణ

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రొక్లెయిన్‌తో ముళ్లకంపను తొలగిస్తున్న సర్పంచి

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో బీసీ శ్మశాన వాటిక పునరుద్ధరణ పనులను సర్పంచి అరుణ్ కుమార్ మంగళవారం చేపట్టారు. గత అనేక ఏళ్లుగా శ్మశాన వాటికకు స్థలం లేక మృతదేహంపై మృతదేహం పూడుస్తున్నారని గ్రామస్తులు సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీకి నిధులు లేకపోయినప్పటికీ బీసీల విన్నపం మేరకు తాత్కాలిక ప్రతిపాదికన జెసిబితో ముళ్లకంపను తొలిగించి గరుసుతో లెవెల్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రహరీ నిర్మించే అవకాశం ఉంటే ప్రయత్నం చేస్తానన్నారు. ఎంపిటిసి నామాల శ్రీను, పంచాయతీ కార్యదర్శి తలారి రాముడు, విఆర్ఓ మునీర్ బాషా, సర్వేయర్ సునీత, సచివాలయ కన్వీనర్లు చాప ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర, వార్డు మెంబర్ భర్త చాకలి బడేసాబ్, వైసిపి నాయకులు దుమ్ము హనుమంతు, నామాల సత్యన్న పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చే రీతిలో పాలన

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్
- రామదుర్గంలో రచ్చబండ, 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజలు మెచ్చే రీతిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. మంగళవారం రామదుర్గం గ్రామంలో సర్పంచి రోహిణి అధ్యక్షతన రచ్చబండ, 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి గుమ్మనూరు జయరామ్, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ నారాయణస్వామి, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున, వైసిపి కన్వీనర్ ఏరూరు రంగస్వామి, ఆలూరు యువజన నాయకులు వీరవిక్రాంత్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రి జయరామ్ రాకతో రామదుర్గం గ్రామ వైసిపి నాయకులు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికి పూలవర్షంపై నడిపించారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా దాదాపు గంటన్నర సమయం పాటు ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే పథకాలపై ఏ విధంగా సంతృప్తి పొందుతున్నారని ఆరా తీశారు. ప్రజల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. చిన్న చిన్న సమస్యలను అక్కడే పరిష్కరించారు. సిసి రోడ్డు అడిగిన వారికి సమాధానం ఇస్తూ తక్షణమే రూ.20 లక్షలతో డ్రెయినేజీతో కూడిన సిసి రోడ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఏ విధంగా లబ్ధి పొందుతున్నారో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జయరామ్ మాట్లాడారు. ప్రజలకు మంచి జరిగి ఉంటే ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలబడాలని కోరారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు మోసకారి మాటలు, కుతంత్రాలతో వస్తారని ఏ ఒక్కరూ మోసపోవద్దని సూచించారు. సర్పంచులు గోవిందరాజులు, నీలకంఠ, ఎంపిటిసిలు మల్లికార్జున, భీమలింగ, సుంకన్న, వైసిపి నాయకులు జూటూరు ధనుంజయ, ఈరప్ప, నాగేంద్ర, బెల్డోన గోవిందు, తిమ్మప్ప, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ కొండయ్య, ఇఒఆర్‌డి సంజన, ఎపిఎం నాగార్జున, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్ నీలా, సూపర్‌వైజర్ ప్రసూన, హౌసింగ్ అధికారి భవ్య, పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ, విఆర్ఒ మల్లికార్జున పాల్గొన్నారు.

'గడపగడపకు' లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి జయరామ్

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

- లెప్రసీ డాక్టర్ ధనలక్ష్మి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుష్టు వ్యాధి నమోదు కేసులను గుర్తించాలని, వ్యాధిగ్రస్తుల వివరాల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని లెప్రసీ డాక్టర్ ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆశా డే సందర్భంగా మండలంలోని పెద్దహరివాణం పిహెచ్‌సి పరిధిలో 15 సచివాలయాల ఎఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడారు. లెప్రసీ కేసులు తక్కువగా నమోదు అవుతున్నాయని, కేసుల గుర్తింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లెప్రసీ కేసులను గుర్తించే విధంగా ఆశావర్కర్లు, ఎఎన్ఎంలతో ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు కలిసి పని చేయాలని తెలిపారు. గ్రామాల్లో లెప్రసీ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కుష్టు వ్యాధి సోకిన వారికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఉచితంగా మందులు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్షయవ్యాధి సూపర్‌వైజర్ వెంగల్ రెడ్డి మాట్లాడారు. క్షయ రోగులకు గళ్ల పరీక్షలు నిర్వహించాలన్నారు. డాక్టర్ నిస్సిరియా, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, చిలకమ్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఆదోని

ట్రాన్స్‌పోర్ట్ హమాలీలకు ఫర్టిలైజర్స్, పెస్ట్‌సైడ్ యజమానులు కూలి రేట్లు పెంచాలని సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫర్టిలైజర్, పెస్టిసైడ్ అసోసియేషన్ అధ్యక్షులు అశోకానంద రెడ్డికి డిమాండ్ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా రెండేళ్లకోసారి కూలి రేట్లు యాజమాన్యంతో ఒప్పందం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈసారి గత రేట్లపై 50 శాతం పెంచాలని కోరారు. హమాలీలకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హమాలీలకు సమగ్ర చట్టం చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ హమాలీలు షాషావలీ, కృష్ణ, వెంకటేశులు, ముని పాల్గొన్నారు.

అటెండర్ భార్య మృతికి నివాళి

ప్రజాశక్తి- పెద్దకడబూరు

పెద్దకడబూరు తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న సింగ్ భార్య మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ వీరేంద్ర గౌడ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, విఆర్ఒలు వీరారెడ్డి, నరసప్ప, విశ్రాంత విఆర్ఒ రామలింగారెడ్డి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటెండర్ సింగ్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయం తహశీల్దార్ వీరేంద్ర గౌడ్ అందజేశారు.

ఛైర్మన్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్‌పిటిసి

కెడిసిసి ఛైర్మన్‌ను కలిసిన జడ్‌పిటిసి

ప్రజాశక్తి - చిప్పగిరి

కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విజయ మనోహరి, ఎస్వీ.మోహన్ రెడ్డి దంపతులను మంగళవారం కర్నూలులోని వారి స్వగృహంలో పంచాయతీరాజ్ వింగ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ అభివృద్ధికి శ్రమించే నాయకులకు, కార్యకర్తలకు తప్పనిసరిగా న్యాయం చేస్తారని తెలిపారు. ప్రతి కార్యకర్త వైసిపి అభివృద్ధికి కృషి చేసి వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో జగనన్నను గెలిపించాలని కోరారు. వైసిపి నాయకులు కుందనగూర్తి నాగప్ప, వైసిపి ఆస్పరి మండల యువ నాయకులు మసాలా ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వైసిపి ప్రభుత్వం పని చేస్తోందని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 22వ వార్డులో నాలుగో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకే జమ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి తగిన ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వార్డులోని కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ లబ్ధి పత్రాలను అందజేస్తున్న జగన్మోహన్ రెడ్డి

టిబి రోగులకు పోషకాహార కిట్లు

పంపిణీ

ప్రజాశక్తి - ఆదోని

ప్రధాన మంత్రి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఆదోనిలోని టిబి కేంద్రంలో మంగళవారం హనుమాన్ నగర్ యుపిహెచ్‌సి స్టాఫ్ రూ.వెయ్యి విలువ చేసే పోషకాహార కిట్లను ఐదుగురు టిబి రోగులకు పంపిణీ చేశారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యావతి మాట్లాడుతూ... దాతలు

ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం..!

- సంపూర్ణ వర్షాలు కురవక రైతులు సతమతం

ప్రజాశక్తి - హోళగుంద

ఈఏడాది సంపూర్ణ వర్షాలు కురవక ఖరీఫ్ సీజన్ ప్రశ్నార్థకంగా మారింది. రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారడంతో మంచి వర్షాలు కురుస్తాయని అనుకున్న రైతులకు అడియాశలే మిగిలాయి. చదురుమొదురు వర్షాలు కురిశాయి. మండలంలో ఏ పంట పొలాలు కూడా సంపూర్ణంగా తడవలేదు. రోజూ మేఘాలు ఊరిస్తూ కనబడడంతో మంచి వర్షాలు కురుస్తాయన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. మండలంలో 17 పంచాయతీలు, మజరా గ్రామాలు కలిపి 23 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 15,333 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఇప్పటివరకు కేవలం బోరుబావుల కింద, అరకొర వర్షాలకు 5,670 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగింది. రబీ సీజన్‌లో 3,150 హెక్టార్ల సాగు భూమి ఉన్నట్లు తెలిసింది.

పనుల్లేక అల్లాడుతున్న వ్యవసాయ కూలీలు

మండలంలో మంచి వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయ కూలీలు సైతం పనుల్లేక అల్లాడుతున్నారు. గతేడాది జూన్, జులై నెలలో మంచి వర్షాలు కురవడంతో వ్యవసాయ కూలీలకు మంచి డిమాండ్ ఉండేది. రూ.250 నుంచి రూ.300కు పైగా కూలి ఇచ్చేవారు. ఈఏడాది పనులు కల్పించి రూ.200 ఇచ్చే వారు కూడా కరువయ్యారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వారం రోజులు పని దొరికింది. కూలి పనులు కూడా దొరికాయని తెలిపారు. ఉపాధి హామీ పనులకు వెళితే సకాలంలో కూలిలు అందక కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారాలు పెద్దగా జరగడం లేదు

వర్షం సరిగ్గా కురవకపోవడంతో వ్యాపారాలు ఏమీ పెద్దగా జరగడం లేదని ఎరువులు, ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేశామని పేర్కొంటున్నారు. కొన్ని కంపెనీల మందులు అయితే క్రెడిట్ ఇచ్చారని, వారికి తిరిగి ఏ విధంగా పైకం చెల్లించాలో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 4, 5 ఏళ్లుగా ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని పేర్కొంటున్నారు. షాపు అద్దెలు, విద్యుత్ బిల్లు కట్టడానికి కూడా వ్యాపారాలు జరగడం లేదని వాపోతున్నారు. కర్ణాటకలో కురిసిన వర్షానికి తుంగభద్ర డ్యాంలో 75 టిఎంసిల వరకు నీరు చేరడంతో ఎల్ఎల్‌సి కాలువకు నీటిని విడుదల చేశారు. ఇప్పటి నుంచి వ్యాపారాలు కొంతవరకు పుంజుకోవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు.

స్కౌట్ స్కాఫ్‌ను అందజేస్తున్న విద్యార్థులు

బాలబాలికలు దేశభక్తిని పెంపొందించుకోవాలి

- ప్రధానోపాధ్యాయులు మన్సూర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రస్తుత సమాజంలోని బాలబాలికలు దేశభక్తిని పెంపొందించుకుని క్రమశిక్షణతో మెలగాలని చిన్నమరివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మన్సూర్ తెలిపారు. స్కౌట్ స్కాఫ్ డే సందర్భంగా మంగళవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్కౌట్ ఉద్దేశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, మంచి నడవడికను పెంపొందించుకుని నవభారత, సమసమాజ సేవకులుగా ఉండాలని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణ చుట్టూ మొక్కలు నాటి ఉపాధ్యాయులకు గౌరవ స్కౌట్ స్కాఫ్‌ను అందజేశారు. స్కౌట్ కెప్టెన్ శిరీష, ఉపాధ్యాయులు ఇబ్రహీం, లక్ష్మయ్య, విజయ్, కృష్ణ, సాహెరా భాను, షాపుల్లా, రహీమ్ పాల్గొన్నారు.

పసి పిల్లలకు తల్లిపాలే శ్రేష్టం

ఆదోని : పసి పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం శ్రేష్టమని ఐఎంఎ సెంట్రల్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐఎంఎ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన శిశువుకు ఆరోగ్యకరమైన పెరుగుదలకు అమ్మపాలకు మించి మరే ఇతర ఆహారం సాటి రాదన్నారు. సభ్యులు డాక్టర్ హరీష్, డాక్టర్ ఉషా రావు, ఈసీ మెంబర్లు డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ సూరదాస్, డాక్టర్ రఘునాథ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, రీజియన్ ఛైర్మన్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

నేటి నుంచి సిపిఎం మహాపాదయాత్ర

- సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మణ్, లింగన్న

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నేటి నుంచి ఈనెల 7 వరకు మహా పాదయాత్ర కొనసాగుతుందని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మణ్, లింగన్న తెలిపారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని సుందరయ్య భవన్ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. శ్రీనివాస భవన్ మైదానంలో పాదయాత్ర గురించి వక్తలు ప్రసంగిస్తారని చెప్పారు. ఈ పాదయాత్రకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ హాజరవుతారని తెలిపారు. పట్టణం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర కర్నూలు ప్రధాన రోడ్డు మీదుగా కొనసాగుతుందన్నారు. ఆరేకల్‌లో భోజనం ఉంటుందని, అక్కడి నుంచి ఎమ్మిగనూరు మండలం నలంద కళాశాల వరకు మొదటి రోజు కొనసాగి రాత్రి బస ఉంటుందని తెలిపారు. రెండోరోజు 3న నలంద కళాశాల నుంచి హనుమాపురం, అక్కడి నుంచి ఎమ్మిగనూరు, అక్కడి నుంచి ఇంజినీరింగ్ కళాశాలలో భోజన విరామం ఉంటుందని చెప్పారు. గోనెగండ్ల చేరుకుని అక్కడ రాత్రి బస చేస్తారని తెలిపారు. 4న గోనెగండ్ల నుంచి హెచ్.కైరవాడి, వెముగోడు మీదుగా కోడుమూరు చేరకుని రాత్రి బస చేస్తారని చెప్పారు. 5న కోడుమూరు నుంచి ప్యాలకుర్తి, మైల్యాండ్ ఢాబా నుంచి నాగులాపురం వద్ద రాత్రి బస చేస్తారని తెలిపారు. 6న నాగులాపురం నుంచి పర్ల సల్కాపురం, పెద్దపాడుకు చేరుకుని తాజ్ ఫంక్షన్ హాలులో రాత్రి బస చేస్తారని తెలిపారు. 7న తాజ్ ఫంక్షన్ హాలు కలెక్టరేట్ వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతారని చెప్పారు. ధర్నాలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు మాట్లాడతారని తెలిపారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 7 వరకు జరిగే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాపాదయాత్ర సందర్భంగా ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో 3న ఉదయం 10.30 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల ఎమ్మిగనూరు పట్టణాల్లో ఇప్పటికే సమస్యలపై సర్వేలు, గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహించినట్లు చెప్పారు. సిపిఎం జిల్లా నాయకులు పి.గోవిందు, హనుమంతు, పట్టణ నాయకులు రాముడు, లక్ష్మీనరసయ్య, విద్యార్థి సంఘం నాయకులు రంగప్ప, విజయ్, యువజన సంఘం నాయకులు సురేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు

- అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు
- డీఎస్పీ శివ నారాయణ స్వామి

ప్రజాశక్తి - ఆదోని

సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు శాంతిభద్రతలపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి, తనిఖీలు చేపట్టినట్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించినట్లు ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆదోని సబ్ డివిజన్ పోలీసులు బృందాలుగా ఏర్పడి మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఆదోని 2వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. ఈ దాడుల్లో 10 బాక్సుల కర్ణాటక మద్యం (960 టెట్రా ప్యాకెట్లు), సరైన ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిఐలు శ్రీనివాస నాయక్, నిరంజన్ రెడ్డి, పార్థసారథి, మంజునాథ్, ఎస్ఐలు జయశేఖర్, చంద్ర, గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు అందించాలి

- ఎంపిడిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పెద్దకడబూరు

సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్ణయించిన వ్యవధిలోపు అందజేయాలని ఎంపిడిఒ శ్రీనివాసరావు వాలంటీర్లను ఆదేశించారు. మంగళవారం మండలంలోని హనుమాపురం గ్రామంలో సర్పంచి పూజారి ఇందిర ఈరన్నతో కలిసి వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. వాలంటీర్లు చేపడుతున్న పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. పింఛన్లను సక్రమంగా అందజేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, బడి బయట పిల్లల సంఖ్య వంటి వాటిపై ప్రధానోపాధ్యాయులు సత్య కరుణను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి అక్కడ బోధన తీరు గురించి ఆరా తీశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వాలంటీర్ల సహాయంతో బడిలో చేర్చుకోవాలన్నారు. అనంతరం నాడు-నేడు కింద నిర్మిస్తున్న అదనపు గదులను పరిశీలించారు. తర్వాత గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలు చేయాలని ఆదేశించారు.

పింఛన్లు అందజేస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- ఆదోని బంగారు దుకాణంలో చోరీ సొత్తు స్వాధీనం
- స్రిసి కెమెరాలు అమర్చుకోవాలి - డీఎస్పీ శివ నారాయణ స్వామి

ప్రజాశక్తి - ఆదోని

దొంగను చూపుతున్న పోలీసులు

పట్టణంలోని షరాఫ్ బజార్‌లోని సోనీ ముఖేష్ బంగారు దుకాణంలో ఇటీవల చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగ గొర్ల సత్యనారాయణను కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణ శివారులో అరెస్టు చేసినట్లు ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. మంగళవారం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 27న పట్టణంలోని షరాఫ్ బజార్‌లోని ముఖేష్ జ్యువెల్లర్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తి షాపులోకి కస్టమర్‌గా వచ్చి, వెండి ఉంగరం కావాలని అడిగాడని తెలిపారు. ముఖేష్ షాపులో లేకపోవడంతో పంకజ్ పక్క షాపులోకి వెళ్లి వెండి ఉంగరం తీసుకొచ్చేలోపు, ఎవరూ లేరని గమనించి షాపులోని షోకేజ్‌లో గల రూ.4.50 లక్షల విలువ గల 7.8 తులాల 30 జతల బంగారు కమ్మల బాక్సును దొంగలించి పారిపోయాడని చెప్పారు. ఈ ఘటనపై జులై 28న కేసు నమోదు చేసి డీఎస్పీ శివనారాయణ స్వామి పర్యవేక్షణలో వన్ టౌన్ సిఐ విక్రమ సింహా, సిబ్బంది రామచంద్ర, సుధీర్, లక్ష్మన్‌లు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారని తెలిపారు. దర్యాప్తులో భాగంగా సిసి టివి ఫుటేజ్‌ను సేకరించి సమాచారం మేరకు జులై 31న కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లోని బైపాస్ రోడ్డులో నిందితుని అరెస్టు చేసినట్లు చెప్పారు. అతని వద్ద ఉన్న 17 జతల బంగారం కమ్మలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో నూజివీడు, వెస్ట్ గోదావరి జిల్లా ఆకివీడు, ఏలూరు వన్ టౌన్, ఏలూరు టూ టౌన్, కైకలూరు, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూర్ పోలీసు స్టేషన్లలో 4 బంగారు ఆభరణాల దొంగతనం కేసులు, 2 చీటింగ్ కేసులు, ఒక పేకాట కేసులు ఉన్నాయని వివరించారు. 30 జతల కమ్మల్లో 13 జతల కమ్మలను హైదరాబాద్‌లో మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో కుదువ పెట్టి రూ.1.18 లక్షలను రుణంగా తీసుకొని వాటిని అప్పులు తీర్చడానికి, పేకాట ఆడటానికి వినియోగించాడని తెలిపారు. కుదువ పెట్టిన 13 జతల బంగారు కమ్మలను కూడా 4 రోజుల్లోపు స్వాధీనం చేసుకొని ఫిర్యాదికి కోర్టు ద్వారా మొత్తం 30 జతల బంగారాన్ని అప్పగిస్తామని తెలిపారు. ఆదోని షరాఫ్ బజార్‌లోని షాపు యాజమాన్యం నిర్లక్ష్యం వీడి, జాగ్రత్త వహించాలని చెప్పారు.

ఎర్ర తెగులు సోకిన పత్తి పంటను పీకేసిన రైతు

పెద్దకడబూరు : మండలంలోని హులికన్వి గ్రామానికి చెందిన రైతు తలారి పరమేష్ ఎర్ర తెగులతో చేతికొచ్చిన పత్తి పంటను మంగళవారం పీకేశా రు. తొలకరి వర్షాలకే పత్తి విత్తనాలు నాటి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నా రు. ఎడతెరపీ లేని వర్షాల కారణంగా, లేక నకిలీ విత్తనాల ప్రభావమేమో కానీ పత్తి పంటకు ఎర్ర తెగులు సోకి పూర్తిగా దెబ్బతినింది. చేసేదేమీ లేక పత్తి పంటను పీకేశారు.

[redacted]

యు.శ్రీనివాసులు S/o. యు. చిన్నసుబ్బన్న, యం.లింగాపురం గ్రామం, కొత్తపల్లి మండలం, నంద్యాల జిల్లా. నేను యం. లింగాపురం గ్రామం నుండి ఆత్మకూరుకి బస్సులో ప్రయాణించే మార్గంలో నా పొలం డాక్యుమెంట్స్ పోయినవి. డాక్యుమెంట్ నెం. 981/1993, 982/1993. కావున ఈ డాక్యుమెంట్ ఎవరికైనా దొరకినచో ఈ క్రింది ఫోన్ నెంబరులను సంప్రదించగలరని కోరుచున్నాము సెల్. 94413 75999.